నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 29-5-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 261 పేజీలు: 4 వెల: రూ.1/-

ఎన్‌కౌంటర్లో ముగ్గురు నక్సల్స్ మృతి

రాంచి,మే28(ఆర్ఎన్ఎ): జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భమ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నక్సలైట్లు మృతిచెందగా, ఒక మావోయిస్టు గాయపడ్డాడు. నక్సలైట్లు ఉన్నారనే సమాచారంతో సీఆర్పీఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు సింగ్‌భమ్‌లో భారీ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో నక్సలైట్లకు, భద్రతా బలగాలకు మధ్య ఈ రోజు తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారని, ఒకరు గాయపడ్డారని ఐజీ సాకేత్ కుమార్‌సింగ్ వెల్లడించారు. ఏకే-47లతోసహా, పెద్దసంఖ్యలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కొండపోచమ్మను తాకనున్న గోదారమ్మ

చినజీయర్ స్వామి సమక్షంలో యాగాలు
యాగాలతో తల్లి గోదావరికి ఆహ్వానం
నేడు లాంఛనంగా ప్రారంభించనున్న సిఎం కెసిఆర్

సిద్దిపేట,మే28(ఆర్ఎన్ఎ): గోదావరి జలాలు పరుగులు తీస్తూ కొండపోచమ్మ సాగర్‌కు రానున్నాయి. కలలో కూడా ఊహించని ప్రపంచ ఇంజనీరింగ్ అద్భుతాల్లో ఒకటిగా చెబుతున్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పరిధిలో ఇది అరుదైన ఘటనగా చెప్పుకోవాలి. అత్యంత ఎత్తుకు గోదావరి జలాలను తరలించే పక్రియను చేప్టిన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కొండపోచమ్మ సాగర్ వరకు జలాలలను రప్పించడం అపరభగీరథ ప్రయత్నమే అనడంలో సందేహం లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా గోదావరి నదిపై లక్ష్మీ బ్యారేజీ (మేడిగడ్డ) నుంచి వివిధ దశల ఎత్తిపోతల ద్వారా తరలించే నీటిని 618 మీటర్ల ఎత్తునున్న కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌కు తరలిస్తారు. 15 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యమున్న కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా సాగునీరందుతుంది. ఇక్కడికి చేరిన నీటితో వివిధ గ్రామాల్లో ఉన్న చెరువులను నింపుతారు. అలాగే ఇక్కడి నుంచే మలిదశలో హైదరాబాద్‌కు గోదావరి నీటిని తరలిస్తారు. ఇందుకు అవసరమైన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశారు. ఈ నీటి రాకతో ఇక హైదరాబాద్ నగరంలో నిరంతరంగా మంచినీటిని సరఫరా చేయాలన్నది సిఎం కెసిఆర్ ప్రణాళిక. అది సాకారమైతే హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలకు నీటి కొరత ఉండదు. ఇకపోతే ఈ ప్రాజెక్టుకు కొండపోచమ్మ పేరు పెట్టడానికి ప్రత్యేక కారణం ఉంది. ఉమ్మడి మెదక్, వరంగల్, నల్లగొండ జిల్లాల సరిహద్దులో జగదేవపూర్ సమీపంలో కొండపోచమ్మ దేవాలయం ఉంది. దాని సమీపంలోనే కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం ఉంది. రెండు దేవాలయాలకు ఎంతో ప్రశస్తి ఉండటంతో నిత్యం భక్తులతో కళకళ లాడుతుంటాయి. ఒక గుడికి వచ్చిన భక్తులు మరో గుడికి వెళ్లే సంప్రదాయం ఉంది. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో నిర్మించే అతిపెద్ద రిజర్వాయర్‌కు మల్లన్నసాగర్ అని, అత్యధిక ఎత్తులో నిర్మించే రిజర్వాయర్‌కు కొండపోచమ్మసాగర్ అని ముఖ్యమంత్రి కేసీఆర్ నామకరణం చేశారు. ఈ నెల 29న శుక్రవారం ఆయన తన స్వహస్తాలతో దీనిని ప్రారంభిస్తారు. గజ్వేల్ ప్రాంత సాగు, తాగునీటి అవసరాలు తీర్చేలా డిజైన్ చేసిన ఈ ప్రాజెక్టు ప్రారంభ ఏర్పాట్లను సీఎం కేసీఆర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 29న చండీయాగం, సుదర్శన యాగం, గంగమ్మ పూజలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించి ఆ మేరకు ఏర్పాట్లకు పురమాయించారు. 29న ఉదయం వేకువ జామున 4 గంటలకు ఏకకాలంలో కొండ పోచమ్మ దేవాలయంలో చండీయాగం, మర్కూక్ వద్ద ఉన్న కొండపోచమ్మసాగర్ పంపుహౌస్ వద్ద సుదర్శన యాగం ప్రారంభమవుతాయి. ఉదయం 7 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు ప్రాజెక్టుకు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చండీయాగంలో భాగంగా నిర్వహించే పూర్ణాహుతిలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు, వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకుంటారు. పూజల అనంతరం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంటారు. తిరిగి ఉదయం 9 గంటల తర్వాత ఎర్రవల్లి, మర్కూక్‌లో నిర్మించే రైతు వేదికలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేస్తారు. మర్కూక్‌లోని కొండపోచమ్మసాగర్ పంప్‌హౌస్‌కు చేరుకుని చినజీయర్ స్వామికి స్వాగతం పలికి, సుదర్శన యాగం పూర్ణాహుతిలో పాల్గొంటారు. 11.30 గంటల ప్రాంతంలో పంప్‌హౌస్ స్విచ్చాన్ చేసిన తర్వాత ప్రాజెక్టు డిశ్చార్జి కెనాల్ వద్దకు వచ్చి గోదావరి జలాలకు స్వాగతం పలికి గంగమ్మ పూజలు నిర్వహిస్తారు. పరిమిత సంఖ్యలో ఆహ్వానితులకు మర్కూక్‌లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. సీఎం రాకను పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం సాయంత్రం కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ వద్ద మంత్రి హరీశ్‌రావు.. కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, సీపీ జోయల్ డేవిస్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు మంత్రి పలుసూచనలు చేశారు. చండీయాగం ఏర్పాట్లను ప్రముఖ వాస్తు ప్లానర్ సుద్దాల సుధాకర్‌తేజ పరిశీలించారు. ÷ఎఖ్యమంత్రి బుధవారం రాత్రి శ్రీ త్రిదండి చినజీయర్ స్వామిని దర్శించుకున్నారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్ సమీపంలోని దివ్య సాకేతాలయం ఆశ్రమంలో జీయర్‌స్వామిని కేసీఆర్ కలసి ఆశీర్వాదం అందుకున్నారు. ఈ నెల 29న కొండపోచమ్మ సాగర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి రావాలని జీయర్‌స్వామిని ఆహ్వానించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మంగళశాసనాలు, ప్రత్యేక కానుకను సీఎంకు అందజేశారు. మొత్తంగా ఈ పథకంలో చివరిఘట్టం తెలంగాణలో మైలురాయిగా నిలవబోతున్నది. దీంతో ఎడారిగా ఉన్న సిద్దిపేట పరిసర ప్రాంతాలు సస్య శ్యామలం కానున్నాయి. వర్షాకాలంలో గోదావరి నీటి ఎత్తిపోసే చర్యలతో ఆయా ప్రాంతాల్లో నిర్మించిన రిజర్వాయర్లు మొత్తం నిండి జలకళను సంతరించుకోనున్నాయి.

లాక్‌డౌన్ సడలింపులో పెరిగిన విద్యుత్ వినియోగం

విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా ఏర్పాట్లు

హైదరాబాద్,మార్చి28(ఆర్ఎన్ఎ): పెరుగుతన్న ఎండల కారణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో రోజురోజుకు విద్యుత్ వినియోగం కూడా పెరుగుతున్నదని అధికారులు తెలిపారు. మొనన్నటి వరకు లాక్‌డౌన్ కారణంగా డిమాండ్ తగ్గింది. వివిధ సంస్థలు, కార్యాలయాలు మూత పడడంతో విద్యుత్ వినియగం నిలిచి పోయింది. అయితే తాజాగా లాక్‌డౌన్ సడలింపుతో మళ్లీ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. మరోవైపు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందేందుకు నగరవాసులు విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. మేలో ఎండలు పెరగడంతో గరిష్ఠ వినియోగానికి చేరుకున్నట్లు అధికారులు అంటున్నారు. వినియోగానికి తగిన విధంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు. నగరంలో డిమాండ్‌కు తగిన విధంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు క్షేత్రస్థాయి అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్, జాయింట్లు లేకుండా చర్యలు తీసుకున్నారు. గత రెండేండ్లుగా నగరంలో భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశాం. విద్యుత్ తీగలను చెట్లు అనుకుని ఉన్న చోట కవర్ కండక్టర్‌లను బిగించాం. నగరంలో డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు ఎలాంటి అంతరాయాలు లేకుండా ఉండేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. వాస్తవంగా వేసవిలో అధిక విద్యుత్ వినియోగం వల్ల తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కవర్ కండెన్సర్లు వంటి వాటిని ఇప్పటికే ఏర్పాటు చేశారు. విద్యుత్ తీగల్లో జాయింట్లు ఉన్నచోట లోడ్ ఎక్కువగా పడి తెగిపోయే ప్రమాదం ఉంది. అలాంటి పరిస్థితులు చోటుచేసుకోకుండా ముందస్తుగానే వాటిని సరి చేశారు. గతేడాది కంటే ఈ యేడు మార్చిలో దాదాపు మూడు మిలియన్ యూనిట్ల నుంచి నాలుగు వరకు అధికంగా వినియోగం పెరిగింది. ప్రస్తుత ఏడాది మార్చి నెల ముగిసేసరికి 60 మిలియన్ యూనిట్లకు చేరుకొనే అవకాశాలున్నాయి. విద్యుత్ శాఖ నాలుగేండ్లుగా ఏడాదికి 2.60 లక్షల కొత్త సర్వీసులను మంజూరు చేస్తూ వచ్చింది. అందులో భాగంగానే పెరుగుతున్న లోడును తట్టుకునేందుకు వీలుగా నగరంలో సబ్‌స్టేషన్లకు ఏర్పాటు చేయడంతో పాటు పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి.. విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. దీంతో నగరంలో పెద్దగా విద్యుత్ అంతరాయాలు కలగడం లేదు.

కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్నాయి
చైనాలోనూ మరోమారు పెరగనున్న సంఖ్య

న్యూఢిల్లీ,మే28(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ నుంచి ఇప్పడే కోలుకుంటున్న చైనాలో రాబోయే రోజుల్లో మరోసారి విజృంభించే అవకాశం ఉందని ఆ దేశ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైరస్ తగ్గుముఖం పట్టడంతో లాక్‌డౌన్ పూర్తిగా ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో గడిచిన వారంరోజులుగా కరోనా పాజిటివ్ కేసులు మళ్లీ నమోదు కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కరోనా పాజిటివ్ కేసుల విషయంలో చైనా తప్పుడు లెక్కలు చెబుతున్నాదన్న విషయంలో అగ్రరాజ్యం అమెరికా వెనక్కి తగ్గడం లేదు. చైనా ప్రస్తుతం చెబుతున్న గణాంకాల కంటే ఎనిమిది రెట్లు ఎక్కువ కేసులు నమోదు అయ్యి ఉంటాయని ఓ నివేదిక తెలిపింది. కాగా ప్రస్తుతం చైనా చెబుతున్న గణాంకాల ప్రకారం ఆ దేశంలో ఇప్పటి వరకు 82 వేల కరోనా పాజిటివ్ నమోదు అయ్యాయి. అయితే చైనా తప్పుడు లెక్కలు చెబుతోందంటూ అమెరికాతో పాటు పలు ప్రపంచ దేశాలు ఆరోపిస్తున్నాయి. డ్రాగన్ దేశంలో ఇప్పటి వరకే 6లక్షల 40 వేలకుపైగా కోవిడ్ కేసులు వెలుగుచూసి ఉంటాయని బహిర్గతం చేసింది. ఈ మేరకు చైనా రక్షణ సాంకేతిక జాతీయ విశ్వవిద్యాలయం నుంచి ఓ నివేదిక లీక్ అయినట్లు వాషింగ్టన్ కేంద్రంగా పని చేస్తున్న 'ఫారిన్ పాలసీ మ్యాగజైన్ అండ్ 100 రిపోర్టర్స్' ఓ వార్తను ఇటీవలే ప్రచురించింది. దేశం వ్యాప్తంగా గల రెస్టారెంట్‌లు, సూపర్ మార్కెట్లు, పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, ఆస్పత్రుల్లో నమోదైన కేసులకు గల వివరాలను నివేదికలో పొందుపరిచినట్లు పేర్కొంది. అలాగే మొత్తం 230 నగరాల్లో నమోదైన రికార్డులను పరిశీలించిన నివేదికను తయారు చేసినట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే చైనా

నియంత్రిత సాగుపై విమర్శలు సరికావు

రైతులకు మేలు చేయాలన్న సంకల్పాన్ని దెబ్బతీయొద్దు
తెలంగాణ రైతాంగానికి మేలు చేసే దిశంగా కెసిఆర్ నిర్ణయాలు
కేంద్ర మాజీమంత్రి వేణుగోపాలాచారి

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం పంట మార్పిడి పద్ధతికి ప్రాధాన్యమిస్తూ నియంత్రిత సాగు విధానం ప్రకటించడం వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులకు వేదిక కాబోతున్నదని కేంద్ర మాజీమంత్రి ,టిఆర్ఎస్ నాయకుడు డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి అభిప్రాయ పడ్డారు. రైతులు ఏ పంటవేయాలో ముందే చెప్పడం వల్ల దానికి మార్కెట్లో డిమాండ్ ఉంటుందన్నారు. అందరూ ఒకేరకమైన పంటలు వేసే విధానం వల్ల ఇంతకాలం కష్టాలను ఎదుర్కొన్నాం. ఇకముందు అలాంటి పరిస్తితి ఉండదన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేయడం వల్ల డిమాండ్ మేరకు ఉత్పత్తి రాగలదని, రైతులకు గిట్టుబాటు ధరలు కూడా దక్కనున్నవన్నారు. అమ్మబోతే అడివి కొనబోతే కొరివి అనే సామెతను మార్చాల్సిందేనని, రైతుల తలరాత రైతులే రాసుకోవాలన్నారు. తెలంగాణలో రైతు రాజ్యం నడుస్తున్నది. రైతులను పైకి తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణబద్ధమై ఉన్నది. తెలంగాణ రైతులకు అప్పులు ఉండవద్దు. సొంతంగా పెట్టుబడులు పెట్టుకునే శక్తి రావాలి. ప్రభుత్వం సూచించే పంటలను పండించాలి. లాభాలు పొందాలని రైతు సోదరులను కోరుతున్నట్లు ప్రకటించారు. గతేడాదికంటే వరి సాగు పెరుగగా ఈ యేడు వరిధాన్యం దిగుబడులు పెరిగాయన్నారు. సిఎం కెసిఆర్ ఆదేశాలతో వానకాలం పంటల యాక్షన్‌ప్లాన్ వ్యవసాయాధికారులు సిద్ధం చేశారు. జూన్ తొలివారంలో తొలకరి జల్లులు పడిన వెంటనే దుక్కులు దున్నేందుకు రైతాంగం సిద్ధమవుతుండగా వ్యవసాయశాఖ కూడా తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించింది. పంటల విస్తీర్ణం అంచనాలను ప్రకటించారు. దీంతో పంటల విధానంలో మార్పులతో ఆదునికత కూడా తోడు కానుందన్నారు. దీనిని అర్థం చేసుకోలేని విపక్షాలు అదేపనిగా విమర్శలుచేస్తున్నాయని చారి అన్నారు. విమర్శలకూ ఓ హద్దు ఉండాలని అన్నారు. వ్యవసాయం గురించి తెలిసిన వారూ విమర్శలు చేయడం సరికాదన్నారు. డిమాండ్ ఉన్న పంటనే వేస్తే రైతులను ఆదుకున్న వారం అవుతామన్నారు. ఇంతకాలం ల్గ÷తులంతా ఒకే రకమైన పంట సాగు చేయడం వల్ల మద్దతు ధర దక్కడం లేదు. దీంతో డిమాండ్‌కు అనుగుణంగా పంటల మార్పిడి అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం.. నియంత్రిత సాగు విధానం ప్రకటించింది. ఈ మేరకు సీఎం కేసీఆర్ మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయశాఖ, రైతులతో సమీక్షలు చేసిన అనంతరం ఏ రకమైన భూముల్లో ఏయే రకమైన పంటలు వేయాలనే విషయమై రూపకల్పన చేశారు. నదుల ద్వారా సాగునీరు లభిస్తుండగా నీటి లభ్యత, భూముల తీరును బట్టి జిల్లాల్లో అత్యధికంగా వరి తరువాత పత్తితో పాటు పెసర, కంది, వేరుశనగా ఇతర పంటలు వేయనున్నారని అన్నారు.

వానకాలం పంటల సాగు విస్తీర్ణంలో ఇప్పటికే కచ్చితమైన అంచనాలతో వ్యవసాయశాఖ సిద్ధమైంది కనుక రైతులకు కూడా ఇబ్బంది రాదన్నారు. సబ్సిడీ విత్తనాలతో పాటు యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులు అవసరం మేరకు సమకూర్చే పనిలో నిమగ్నమైంది. విత్తనాలు, ఎరువులను ప్రాథమిక వ్యవసాయ సంఘాలు, గ్రోమోర్ రిటైల్ కేంద్రాలతో పాటు ఇతర కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

నిప్పులు చెరుగుతున్న సూరీడు

ఉభయ తెలుగురాష్ట్రాల్లో వడగాడ్పుల తీవ్రత
కేరళను నైరుతి తాకే వరకు ఇదే పరిస్థితి
బయటకు రాకూడదంటున్న వైద్యులు

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో భానుడు భగ్గు మంటూ ఉదయం నుంచే నిప్పులు కురిపిస్తు న్నాడు. సాధారణ కంటే 5 డిగ్రీలు ఎక్కువగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. జూన్ మొదటివారం వరకు ఎండల తీవ్రత ఇలానే ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కేరళను రుతుపవనాలు తాకితే తప్ప వాతావరణంలో మార్పు సాధ్యం కాదని అంటున్నారు. అప్పటి వరకు ఎండలకు తోడు, వడగాలు ప్రభావం కూడా ఉంటుందన్నారు. మండుటెండలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాలు అదిరి పోతున్నాయి. దీంతో జనం ఇంటి నుంచి బయటికి రావాలంటేనే జంకుతున్నారు. ఏపీలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా వడగాల్పులు వీచే అవకాశముందని హెచ్చరించి. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలున్నట్లు తెలిపింది. 12 గంటలకే రాష్ట్రంలో 44 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకుంటున్నాయి. సాయంత్రం మూడు గంటలకు 47 డిగ్రీలు దాటే సూచనలున్నాయని పేర్కొంటున్నారు. వడగాల్పులు తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ప్రజలు ఎండల్లో తిరగకుండా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు, గుంటూరు, విజయనగరం చిత్తూరు, కృష్ణా, అనంతపురం జిల్లాలతోపాటు విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ రోజు ఉష్ణోగ్రతలు 45 నుండి 47 డిగ్రీలకు పైగా నమోదవుతాయని తెలిపింది. ఉభయగోదావరి జిల్లాలతోపాటు శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 44 నుండి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని చెప్పింది. వృద్ధులు, చిన్నారులు ఎండల్లో తిరగకుండా వీలైనంత వరకు నీడలోనే ఉండాలని కోరారు. మరోవైపు ఎండల కారణంగా సాయంత్రం ఆరు దాటితే ఎండలు చల్లారడం లేదు. మరోవైపు రాత్రివేళల్లో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు పగటి వేళల్లో బయటకు వెళ్లకపోవడం మంచిదని చెప్పారు. తప్పని పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు దగ్గర పెట్టుకోవాలని, తరచూ నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని సూచించారు. గతంలో ఎప్పుడూ లేనంతగా 48 డిగ్రీలకు చేరువల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పులు వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈదురుగాలు లతోపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. భానుడి భగభగలకు ఉదయం 10 గంటలు దాటాక జనం ఇండ్లనుంచి బయటకు వచ్చేందుకు జంకుతుండటంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. హైదరాబాద్ మొదలుకొని ఆదిలాబాద్ వరకూ ఇదే పరిస్థితి నెలకొన్నది. వడగాడ్పుల వల్ల భూమి వేడెక్కి ఆకస్మిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. చాలాచోట్ల పగటి ఉష్ణోగ్రతలు 4 నుంచి 7 డిగ్రీలు అధికంగా రికార్డవు తున్నాయని, దీంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని, మరో ఐదురోజుల వరకు చాలాచోట్ల వడగాడ్పుల తీవ్రత కొనసాగుతుందని తెలిపారు. హైదరాబాద్‌లోనూ ఎండలు దడపుట్టిస్తున్నాయి. ఈ నెలలో రెండుసార్లు పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాత్రి సమయంలోనూ ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

కాశ్మీర్‌లో పుల్వామా తరహా ఉగ్రదాడికి కుట్ర

పసిగట్టి హెచ్చరించిన ఇంటిలిజెన్స్
భద్రతా బలగాల అప్రమత్తతో పట్టుబడ్డ పేలుడు కారు

శ్రీనగర్,మే28(ఆర్ఎన్ఎ): జమ్మూకశ్మీర్‌లో భారీ ఉగ్రకుట్రను భగ్నం చేశారు. పుల్వామా తరహా దాడికి ప్రయత్నాలు జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 20 కిలోల పేలుడు పదార్థాలతో వెళ్తున్న ఓ కారును భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. పుల్వామాలోని అవిగుండ్ రాజ్‌పొరా ప్రాంతంలో నకిలీ రిజిస్ట్రేషన్ నెంబర్‌తో వెళ్తున్న వాహనాన్ని ఇవాళ ఉదయం చెక్ పాయింట్ వద్ద భద్రతా దళాలు అడ్డుకున్నాయి. కానీ ఆ వాహనం బారికేడ్లను ఢీకొట్టి ముందుకు వెళ్లింది. ఆ సమయంలో సెక్యూర్టీ దళాలు ఫైరింగ్‌కు దిగాయి. సాంట్రో కారును వదిలేసి.. డ్రైవర్ తప్పించుకుని వెళ్లాడు. ఐఈడీలతో ఉన్న వాహనాన్ని అక్కడ వదిలేసి వెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ విజయ్ కుమార్ తెలిపారు. ఉగ్రదాడికి ప్లాన్ వేసినట్లు తమకు ఇంటెలిజెన్స్ సమాచారం వచ్చినట్లు అధికారి తెలిపారు. నిన్నటి నుంచి ఐఈడీలతో ఉన్న వాహనం కోసం తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఐఈడీలతో ఉన్న కారును.. బాంబు స్క్వాడ్ పేల్చేసింది. ఈ ఘటన వల్ల సమీపంలో ఉన్న కొన్ని ఇండ్లు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. సైన్యం, పోలీసులు, పారామిలిటరీ దళాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భాగంగా ఐఈడీ వాహనాన్ని పట్టుకున్నట్లు ఐజీ విజయ్ కుమార్ తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరిలో పుల్వామాలోనే సీఆర్‌పీఎఫ్ వాహనశ్రేణిని ఐఈడీలతో నిండిన వాహనం ఢీకొట్టిన ఘటనలో 40 మంది జవాన్లు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆ ఘటన తర్వాత ఇండోపాక్ మధ్య స్వల్ప యుద్ధ వాతావరణం నెలకొన్నది. నకిలీ రిజిస్ట్రేషన్ ఉన్న సాంట్రో కారు నంబర్ ప్లేటు.. ఓ స్కూటర్‌ది అని గుర్తించారు. కథువా జిల్లాకు చెందిన స్కూటర్ నెంబర్ ప్లేట్‌తో సాంట్రో వాహనాన్ని దుండగుడు నడిపినట్లు తెలుస్తోంది. పరారైన ఉగ్రవాదిని హిజ్బుల్ కార్యకర్తగా భావిస్తున్నారు. ఈ కేసును ఎన్ఐఏకు అప్పగించారు. ఇదిలావుంటే గత రెండు నెలల నుంచి జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర దాడులు ఎక్కువయ్యాయి. సుమారు 30 మంది భద్రతా సిబ్బంది ఆ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో సుమారు 38 మంది ఉగ్రవాదులు కూడా హతమయ్యారు. ఇటీవలే హిజ్బుల్ ముజాయిద్దిన్ కమాండర్ రియాజ్ నైకూను భద్రతా దళాలు హతమార్చిన విషయం తెలిసిందే. పాకిస్థాన్‌లో శిక్షణ పొందిన ఉగ్రవాదులు.. కశ్మీర్‌లో చొరబాట్లకు ప్రయత్నిస్తున్నారు. దీంతో అక్కడ తరుచూ ఎదురుకాల్పుల ఘటనలు జరుగుతున్నాయి.

వలస కూలీల కష్టాలపై సుప్రీంకోర్టులో విచారణ

91 లక్షల మంది వలస కూలీలను తరలించాం
సుప్రీంకు వివరించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,మే28(ఆర్ఎన్ఎ): దేశ వ్యాప్తంగా దాదాపు 91 లక్షల మంది వలస కూలీలను రైళ్లలో వారి స్వస్థలాలకు తరలించినట్టు కేంద్రం సుప్రీం కోర్టుకు తెలిపింది. తరలించిన వారిలో 80శాతం మందికి పైగా కూలీలు యూపీ, బిహార్‌లకే వెళ్లారన్నారు. కరోనాతో విధించిన లాక్‌డౌన్‌తో దేశంలో పలుచోట్ల చిక్కుకుపోయిన వలస జీవుల కష్టాలపై సుప్రీంకోర్టులో విచారణ నిర్వహించింది. సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్రం తీసుకున్న చర్యలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరించారు. మే 1 నుంచి ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా దాదాపు 91 లక్షల మంది వలస కూలీలను రైళ్లలో తరలించినట్టు చెప్పారు. మే 1 నుంచి శ్రామిక్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వలస కూలీలకు ఆహారం, ఆశ్రయం, రవాణా వసతులతో పాటు ఫండింగ్ తదితర అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేం చేశాయనే దానిపై త్రిసభ్య ధర్మాసనం సొలిసిటర్ జనరల్‌ను దాదాపు 50 ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. అలాగే, గత కొన్ని రోజుల నుంచి రైల్వేశాఖ 84లక్షల భోజనాలను సమకూర్చిందని వివరించారు. చిట్టచివరి వలస కూలీని సైతం స్వస్థలాలకు చేర్చే వరకూ శ్రామిక్ ప్రత్యేక రైళ్ల సేవలను కేంద్రం కొనసాగిస్తుందని కోర్టుకు తెలిపారు.వలస కూలీలను స్వస్థలాలకు చేర్చడం, వారికి ఆహారం సమకూర్చడంలో చాలా పెద్ద సమస్య ఉత్పన్నమైంది. అనేకమంది

నియంత్రిత వ్యవసాయంతోనే పంటలకు డిమాండ్

రైతులకు లాభం చేకూరేలా సిఎం కెసిఆర్ ప్రణాళిక: బోడకుంటి

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో రైతులు పండించే పంటకు పూర్తిస్థాయి డిమాండ్ రావాలన్న సదుద్దేశ్యంతోనే సీఎం కేసీఆర్ నియంత్రిత వ్యవసాయ విధానంపై దృష్టి సారించారని మండలిలో చీఫ్‌విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు. దీనిని రాష్ట్ర రైతాంగంతోపాటు యావత్ దేశం స్వాగతిస్తున్నదని శాసన అన్నారు. డిమాండ్ ఉన్న పంటలను వేయడం ద్వారా రైతులకు లాభం చేకూర్చాలని ప్రయత్నించడం ఓ మంచి ప్రయత్నమని అన్నారు. దేశంలో ఇలాంటి ప్రయత్నాలు గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. దీనిని రైతులంతా స్వాగతిస్తుంటే విపక్షాలు మాత్రమే విమర్శిస్తున్నాయని అన్నారు. ఈ విషయంలో కనీస పరిజ్ఞానం లేని వారు విమర్శించడం సరికాదని హితవు పిలికారు. రాష్ట్రంలో ఉన్న నేలలకు తెలంగాణ సోనాతో పాటు ఇతర సన్నాలు సాగు చేస్తే మంచి దిగుబడి రావడంతో పాటు మద్దతు ధర సైతం అందనున్నట్లు పేర్కొన్నారు. రా

గొప్ప సంఘ సంస్కర్త- కందుకూరి

నేటినిజం
శుక్రవారం 29-5-2020

కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త, తెలుగు జాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి. సంఘ సంస్కరణకు, సామాజిక దురాచారాల నిర్మూలనకు నిరుపమానమైన కృషి చేసిన మహానుభావుడు ఆయన. సాహితీ వ్యాసంగంలోనూ అంతటి కృషి చేసిన కందుకూరి బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు. వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించాడు. వీరి పూర్వీకులు ఇప్పటి ప్రకాశం జిల్లా లోని కందుకూరు గ్రామం నుండి రాజమండ్రి కి వలస వెళ్ళడం వలన వారికి ఈ ఇంటి పేరు స్థిరపడిపోయింది. వీరేశలింగంకు నాలుగేళ్ళ వయసులో తండ్రి చనిపోయాడు. పెదతండ్రి, నాయనమ్మల పెంపకంలో అల్లారుముద్దుగా పెరిగాడు. తన పదమూడో యేట బాపమ్మ అనే ఎనిమిదేళ్ళ అమ్మాయితో బాల్యవివాహ మయింది. పెరిగి పెద్దయ్యాక వీరేశలింగం ఇటువంటి దురాచారాల నిర్మూలనకే కృషి చేసాడు. చదువుకునే రోజుల్లో కేశుబ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు మొదలైన వాటి మీద నమ్మకం తగ్గడమే కాక, దయ్యాలు, భూతాలు లేవనే అభిప్రాయానికి వచ్చాడు. ప్రజలకు అది నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి వెళ్ళేవాడు. ప్రభుత్వోద్యోగంలో చేరాలంటే లంచం ఇవ్వాలని, న్యాయవాద వృత్తిని స్వీకరిద్దామంటే అబద్ధాలు ఆడాలని తెలిసి రెంటినీ వదిలేసి ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాడు. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు, సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చెయ్యడానికి 1874 అక్టోబరు లో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించాడు. "సంఘం లోని అవకతవకలను ఎత్తి చూపడం, దురాచారాల నిర్మూలన, ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలంగా ఉన్న అవినీతిని ఎత్తిచూపి, అవినీతిపరులను సంఘం ముందు పెట్టడం" వివేకవర్ధని లక్ష్యాలని ఆయన మొదటి సంచికలో తెలియజేసాడు. చెప్పడమే కాదు, అలాగే నడిపాడు కూడా. వివేకవర్ధని అవినీతిపరుల పాలిట సింహస్వప్నమయింది. తాను నమ్మిన సత్యాన్ని, సిద్ధాంతాన్ని తు.చ. తప్పకుండా పాటించిన వ్యక్తి ఈయన. 1881 డిసెంబరు 11న తమ ఇంట్లో మొట్టమొదటి వితంతు వివాహం చేశాడు. తొమ్మిదేళ్ళ బాల వితంతువు గౌరమ్మ తిరువూరు తాలూకా రేపూడి కి చెందిన పిల్ల. వరుడు గోగులపాటి శ్రీరాములు . ఈ పెళ్ళి పెద్ద ఆందోళనకు దారి తీసింది. పెళ్ళికి వెళ్ళినవాళ్ళందరినీ సమాజం నుండి వెలి వేశారు. సమాజం నుండి ఎంతో ప్రతిఘటన ఎదురైనా పట్టుబట్టి సుమారు 40 వితంతు వివాహాలు జరిపించాడు. పైడా రామకృష్ణయ్య, ఆత్మూరి లక్ష్మీ నరసింహం, బసవరాజు గవర్రాజు వంటి మిత్రులు, మరియు ఆయన విద్యార్థులు వీరేశలింగానికి అండగా నిలిచారు. ఆయన భార్య కందుకూరి రాజ్యలక్ష్మమ్మ భర్తకు బాసటగా ఉంది. వంటవాళ్ళు, నీళ్ళవాళ్ళు వారి ఇంటికి రావడానికి నిరాకరించినపుడు రాజ్యలక్ష్మమ్మ స్వయంగా గోదావరికి వెళ్ళి నీళ్ళు తెచ్చి, పెళ్ళివారికి వంట చేసిపెట్టింది. స్త్రీల కొరకు సతీహిత బోధిని అనే పత్రికను కూడా నడిపాడు. చిన్ననాటినుండి అతనికి అలవడిన స్వాభావిక లక్షణములే కార్యదీక్ష, సాహసము,విజ్ఞా నత్రుష్ణలు. రామమోహనరాయ్, దేవేంద్రనాద్ ఠాగూర్, కేశవ చంద్రసేన్,ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ల బోధనలు, రచనలు ఇతని ఆధ్యాత్మిక చింతనలో విప్లవాత్మమైన మార్పును గోనితెచ్చెను. 1887 సం॥లో సంఘ సంస్కరణ సమాజము స్థాపించి, మతమనే ముసుగులో అధోగతిలో ఉన్న హైందవ సమాజములోని దురాచారములపై విప్లవ ధ్వజమెత్తారు. అతడు మూడ విశ్వాసములు, సనాతనాచారములపై జరిపిన పోరాటము చిరస్మరణీయమైనది. 1848, ఏప్రిల్ 16న జన్మించిన వీరు 27 మే, 1919 సం॥లో మరణించారు. నేడు వీరి వర్ధంతి మూలంగా కొన్ని విషయాలు తెలపాలని..

నిర్దేశించిన పంటలనే వేయాలి

రైతులకు సహాయకారిగా అధికారులు

సన్న,చిన్నకారు రైతులను ప్రోత్సహించడమే లక్ష్యం

నల్లగొండ,మే28(ఆర్ఎన్ఎ): నల్లగొండ జిల్లాలో 10,67,318 ఎకరాల్లో పంటల సాగు నిర్దేశిరచినట్లు జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గత వానకాలం 48శాతం సన్నరకాలు, 52శాతం దొడ్డు రకాలు రైతులు సాగు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశిరచిన మేరకు వరిలో 72శాతంపైగా సన్నరకాలు (బీపీటీ-5204, సోనా ఆర్ఎన్ఆర్ 15048, ప్రైవేట్ సన్నరకాలు, చింట్లు, అంకుర్ సోనా), 28శాతం దొడ్డు రకాలు(ఎంటీయూ-1010, బతుకమ్మ)సాగు చేయాలన్నారు. పత్తిలో అంతర పంటగా కందిసాగు పెరిగేలా చూడాలని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులను ఆయన ఆదేశించారు. సన్న రకాలు టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా రాయితీపై ప్రభుత్వమే సరఫరా చేస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు మండల, గ్రామాల వారీగా అగ్రికల్చర్ కార్డు తయారు చేయాలని సూచించారు. ఏఎమ్మార్పీ పరిధిలో పత్తి, కంది, ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువుల సాగును ప్రోత్సహించి 5000క్వింటాళ్ల జీలుగ, 400క్వింటాళ్ల జనుము విత్తనాలు మండల కేంద్రాల ద్వారా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ అనేక రకాల ప్రోత్సాహకాలను అందిస్తోంది. రైతులను లాభాల్లోకి నడిపించేందుకే పంటల మార్పిడికి శ్రీకారం చుట్టింది. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సూచించిన పంటలనే రైతులు సాగుచేయాలి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఏఏ ప్రాంతాల్లో ఎలాంటి రకాల భూములు ఉన్నాయి.. ఆయా భూముల్లో ఎలాంటి పంటలు వేయాలనేది నిర్ధారణకు వచ్చింది. పంటల మార్పిడిపై జిల్లా వ్యాప్తంగా క్షేత్రసమావేశాలుంటాయి. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి రైతులతో మాట్లాడిస్తూనే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో ప్రసంగాలు ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు.

అమ్మాయిలు జాగ్రత్తగా ఉండాలి

ఉద్యోగాల పేరుతో ఎరవేసే ప్రమాదం

పోలీస్ అధికారుల హెచ్చరిక

అనంతపురం,మే28(ఆర్ఎన్ఎ): అనామకుల సూచనలతో చిక్కుల్లో పడవద్దని జిల్లా పోలీస్ అధికారులు హెచ్చరించారు. కొందరు కావాలనే అమాయకులైన అమ్మాయిలను లక్ష్యంగా చేసుకుని కాచుకుని ఉన్నారని అన్నారు. అనంతలో జరిగిన ఘటన చూసైనా యువతులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఉద్యోగం పేరుతో అమాయకురాలిని వ్యభిచార రొంపిలోకి దింపేందుకు ప్రయత్నించిన మహిళపై అనంతపురం త్రీటౌన్ పోలీసులు నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారు. సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం రూరల్ పరిధిలోని ఒక ప్రాంతంలో రెండు నెలల కిందట పద్మావతి అలియాస్ దస్తగిరమ్మ అనే మహిళ నివాసముంటోంది. తన ఇంటి సమీపంలో ఉంటున్న ఓ అమ్మాయి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తుండటం గమనించింది. తనకు ప్రొద్దుటూరులో తెలిసిన వారున్నారని, అక్కడికొస్తే ఉద్యోగం ఇప్పిస్తానని, భవిష్యత్తు బాగుంటుందని తెలపడంతో ఆ అమ్మాయి నమ్మింది. ఇంట్లోవివరికీ చెప్పకుండా పద్మావతి వెంట ప్రొద్దుటూరుకు వెళ్లింది. విషయం తెలియకపోవడంతో అమ్మాయి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరులో ఉద్యోగం చూపిస్తానని తీసుకెళ్లిన పద్మావతి వ్యభిచార వృత్తి చేసుకుంటే కావలసినంత సంపాదన వస్తుందని అమ్మాయికి ఆశ చూపింది. తాను అలాంటి పని చేయనని చెప్పినా ఎలాగైనా ఆ రొంపిలోకి దించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. ఎలాగోలా ఆమె నుంచి అమ్మాయి తప్పించుకుంది. అప్పటికే లాక్‌డౌన్ అమలులో ఉండటంతో ప్రొద్దుటూరులోనే ఇరుక్కుపోయింది. అమ్మాయి ఆచూకీ తెలుసుకున్న త్రీటౌన్ సీఐ రెడ్డప్ప తన బృందంతో వెళ్లి అనంతపురం తీసుకొచ్చారు. పద్మావతిపై ఉమెన్ ట్రాఫికింగ్ (అమ్మాయిల తరలింపు) కేసు నమోదు చేశారు.

తెలుగు సిఎంలకు ఎన్టీఆర్ ఆశిస్సులు: లక్ష్మీపార్వతి

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి.. ఆంధ్రుల ఆరాధ్యుడు ఎన్టీఆర్ ఆశీస్సులు ఉంటాయని వైసీపీ నేత, తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్వతి చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె.. ఎన్టీఆర్ ఆశయాలు కొనసాగించే వారికే ఆయన ఆశీస్సులుంటాయని వ్యాఖ్యానించారు. అదృష్టం కొద్దీ తెలుగు రాష్ట్రాలకు మంచి ముఖ్యమంత్రులు దొరికారన్నారు. ఎన్టీఆర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కొనసాగిస్తున్నారని లక్ష్మీ పార్వతి తెలిపారు. తెలంగాణ ప్రజలను సీఎం కేసీఆర్ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారని అన్నారు. తెలుగు వారి కష్టాలను తీర్చటానికి ఇద్దరు ముఖ్యమంత్రులు అహర్నిశలు కష్టపడున్నారని లక్ష్మీ పార్వతి చెప్పుకొచ్చారు.

డిమాండ్ ఉన్న పంటలనే వేసుకోవాలి

-రైతులకు మంత్రి సత్యవతి సూచన

మహబూబాబాద్,మే28(ఆర్ఎన్ఎ): నియంత్రిత సాగు విధానంతో రైతులకు లాభం జరుగుతుందని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. పంటల డిమాండ్ మేరకు పండిస్తే గిట్టుబాటు ధరల కోసం ఆందోళన చెందాల్సి రాదన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతి మడుగులో రైతులతో అవగాహన సదస్సు జరిగింది. నియంత్రిత సాగు విధానం గురించి రైతులకు మంత్రి సత్యవతి రాథోడ్ వివరించారు. రైతు బంధు, రైతు బీమా, రుణమాఫీ అమలు చేస్తున్నామని, రైతును రాజును చేయడమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ పని చేస్తున్నారని కొనియాడారు. డోర్నకల్ నియోజకవర్గంలో రెండు ప్రధాన కాలువలకు వీరభద్రస్వామి, భద్రకాళి అమ్మవారి పేర్లు నామకరణం చేశామని, రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేస్తున్నామని ప్రశంసించారు.

రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు: యనమల

అమరావతి,మే28(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్రస్తుతం భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. న్యాయస్థానం ఆదేశాలను కూడా లెక్క చేయనన్న రీతిలో జగన్ వ్యవహారం ఉందన్నారు. రాజ్యాంగం, కోర్టుల మీద గౌరవం లేకుండా జగన్ నిర్ణయాలు ఉన్నాయన్నారు. పథకాల రూపంలో నిధులు ఇస్తూ వసూళ్ల రూపంలో వెనక్కి లాగేసుకుంటున్నారని యనమల విమర్శించారు. హిట్లర్ ఆలోచనల రీతిలోనే జగన్ తీరూ ఉందన్నారు.న్యాయస్థానాలు అంటే జగన్‌కు లెక్కలేదని.. కోర్టులను కూడా బెదిరించే ధోరణిలో ఆంగ్ల మాధ్యమంపై జగన్ నిర్ణయాలు ఉన్నాయని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు చినరాజప్ప పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులపై కేసుల విషయంలో ఏకపక్షంగా వ్యవహరించాలని డీజీపీని అదేశించటం దుర్మార్గమన్నారు.

ఐదోదశ వేళ కానరాని సన్నద్ధత

హైదరాబాద్, మే 28:లాక్‌డౌన్ ఐదోదశ కూడా కొనసాగుతుందనుకుంటున్న వేళ అనేక రంగాల ప్రజల దుర్భర జీవితాలపై అధ్యయనం చేసి వారిని అదుకునే ప్రయత్నాలు చేయాలి. ఇప్పటి వరకు ప్రదాని మోడీ ప్రకటించిన 20లక్షల కోట్ల ప్యాకేజీ ఏయే రంగాలను ఆదుకున్నదీ లేనిదీ అధ్యయనం చేయాలి. నిజంగానే ప్యాకేజీ వల్ల మేలు జరిగిందా లేదా అన్నది తెలుసుకునేందుకు ప్రయత్నం చేయాలి. ప్రభుత్వానికి విస్తృతమైన యంత్రాంగం ఉన్నందున నివేదికలు తెప్పించుకోవాలి. ఇంటిలిజెన్స్ ద్వారా ప్రజలు ఏమనుకుంటున్నారో సమాచార సేకరణ చేయాలి. అవసరమైతే దెబ్బతిన్న రంగాలకు సంబంధించి వివరాలు తెప్పించుకుని ముందుకు సాగాలి. అప్పుడే లాక్‌డౌన్ కష్టాల వల్ల ప్రజలకు ఉపశమనం దక్కుతుంది. ప్రధానంగా వలస కూలీలు ఎదుర్కొటున్న సమస్యలపై తక్షణ చర్యలకు ఉపక్రమించాలి. ఇప్పటికే వందలాది మంది సర్కార్ నిర్లక్ష్యానికి బలయ్యారు. కొన్ని రాష్ట్రాల్లో తగిన చర్యలు తీసుకుని వారిని ఆదుకున్నా ప్రాణభయంతో వారంతా తమ సొంతూళ్లకు వెళ్లి, కుటుంబాలతో గడపాలన్న ఆశతో ఎండలను సైతం లెక్క చేయకుండా వందల కిలోమీటర్లు కాలిబాటన బయలుదేరారు. ఇవన్నీ కళ్లకు కనిపిస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ఆదుకున్న ప్రయత్నాలు చేయలేదు. చిత్తశుద్ధిగా వ్యవహరించ లేదు. దేశ పునర్నిర్మాణంలో అతిపెద్ద భాగస్వాములైన వారిని శలభాల మాదిరిగా పక్కన పెట్టారు. దేశంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలూ ఇలా చేసివుంటే వలసజీవులకు సమస్యలే ఎదురయ్యేవి కాదు. కనీసం ఇప్పుడైనా వలసజీవుల వెతలపై అందరూ దృష్టి సారించాలి. వారి సంక్షేమం కోసం ఏంచేయాలో, ఇప్పుడెదురైన చేదు అనుభవాలు భవిష్యత్తులో ఎదురు కాకూడదనుకుంటే ఎలాంటి చర్యలు చేయడం అవసరమో లోతుగా ఆలోచించాలి. కరోనా వైరస్ మహమ్మారితో దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్ కారణంగా వలసజీవుల జీవితాలు దుర్భరమయ్యాయి. రోజూ దేశంలో లక్షలాదిమంది జాతీయ రహదార్ల వెంట, రైలుపట్టాల పొడవునా నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు మన దౌర్భాగ్యాన్ని, ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని కళ్లకు కట్టాయి. లాక్‌డౌన్ విధిస్తే వచ్చే పర్యవ సానాలను అంచనా వేసుకుని, అందుకవసరమైన ముందస్తు చర్యలు అమలు చేసివుంటే ఈ దుస్థితి వచ్చేది కాదు. ప్రభుత్వాల మాటవిని వున్నచోటే వుండిపోతే ఆకలిచావు ఖాయమని నిర్ధారించుకున్నాకే వలస జీవులంతా స్వస్థలాల బాట పట్టారు. వారి కష్టాలను విని, చూసి ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు రంగంలోకి దిగి చేతనైనంత చేయడంతో కొందరైనా పొట్టనింపుకోగలిగారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సిఎంలు తమ కన్నబిడ్డల్లాగా వారిని అక్కున చేర్చుకున్నారు. రాష్ట్రం మీదుగా నడిచివెళ్తున్నవారిని సైతం పట్టించుకుని రైళ్లు, బస్సుల ద్వారా వారి వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాటు ఎపి ప్రభుత్వం చేసింది. దానికి ముందు వారందరికీ ఆశ్రయం కల్పించి, కడుపునింపారు. వారి కనీసావసరాలు తీరేలా చూశారు. అయినా నిత్యం ఠికానా లేకుండా అడుక్కునే పరిస్థితిలాగా వారి జీవితాలు మారాయి. ఇన్ని అనుభవాల దృష్ట్యా ప్రభుత్వాలు ఆలోచనలు చేశాయి. వివిధ రంగాల్లో ఉన్న వలసకూలీలు వెళ్లకుండా జాగ్రత్త పడాల్సి ఉంది. మన దేశంలోవున్న కార్మికుల్లో 82శాతం మంది అసంఘటిత రంగానికి చెందినవారే అన్న నిజాన్ని గుర్తించాలి. ఈ దేశంలో ఉన్న అభివృద్ధికి వారే పునాది రాళ్లు. దేశంలోని సమస్త మౌలిక సదుపాయాలకూ వీరే వెన్నెముక అన్నది కూడా మరవరాదు. మాల్స్, మల్టీప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, ఆసుపత్రులు, ఫ్యాక్టరీలు అన్నీ వీరి శ్రమశక్తితోనే నిర్మాణమయ్యాయి. ఆకాశ హర్మ్యాలకు రంగులద్దినా, గూడ్స్ రైళ్లనూ, ట్రక్కులనూ సరుకులతో నింపినా, రిక్షాలు లాగినా, ఆటోలు నడిపినా, తోపుడు బళ్లపై ఆధారపడినా, ఆహారమో, సరుకులో ఇంటింటికీ అందించినా అంతా వీరి చలవే అన్నది పాలకులు గుర్తించాలి. ఈ పనులు చేసేవారిలో అత్యధికులు దళితులు, ఆదివాసీలే. ప్రభుత్వాలు ప్రణాళిక ప్రకారం సాగివుంటే, అభివృద్ధి పనులకు సంకల్పించి ఉంటే ... ఉన్న ఊరు వదిలి వీరంతా కన్నవారిని విడిచి, భార్యాబిడ్డల్ని వదిలి వేల కిలోమీటర్ల దూరం దాటి రావల్సిన ఆగత్యం ఏర్పడేది కాదు. ఇలా నగరాలకొస్తున్నవారంతా ఎంతటి దుర్భరమైన స్థితిలో బతుకు లీడుస్తున్నారో చూస్తే జాలివేయక తప్పదు. ప్రభుత్వాలన్నీ సంఘటిత రంగాన్ని పట్టించు కుంటూ, ఆ రంగంలోనివారికి పనికొచ్చే నిర్ణయాలు మాత్రమే తీసుకుంటున్నాయి. దేశ సంపద పెంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలసజీవుల్ని పూర్తిగా ఉపేక్షిస్తున్నాయి. చెప్పుకోవడానికి పేదరిక నిర్మూలన పథకాలు దేశంలో చాలానే వున్నా.. అవేవీ ఈ వలస కార్మికులను ఆదుకోలేదని నిరూపితం అయ్యింది. లాక్‌డౌన్ విధించాక వలస జీవులకు ఇన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు చేసిందేమీ లేదని వెల్లడైంది. వసల కార్మికులు కోట్లలో ఉంటే కేవలం లక్షల్లో మాత్రమే వారిని తరలించేందుకు రైళ్లను సమకూర్చారు. కనీసం ఇకపై చేయాల్సిందేమిటన్న అంశంపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాలి.

ఐదోదశ అంటున్న దశలో ఇక పేదలకు ఇచ్చే 1500 రూపాయల సాయం కూడా నిలిపివేస్తున్నట్లు తెలంగాణ సిఎం కెసిఆర్ ప్రకటించారు. వలస జీవులతో పనులు చేయించుకుంటున్న యజమానుల్లో అత్యధికులు వారికి సంబంధించి ఎలాంటి రికార్డులూ నిర్వహించడం లేదు. కార్మికులకు న్యాయంగా దక్కవలసిన పథకాలను ఎగ్గొట్టడం కోసం చాలా తక్కువ మందిని లెక్కల్లో చూపుతారు. పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగాలు పక్కన పెట్టాయి. ఈదశలో ఇక కార్మికులకు స్వరాష్ట్రంలో ఉపాధి చూపే దిశగా పథకాలు రూపొందించాలి. వారి కుటుంబాలకు బతుకు భయం లేకుండా చూడాలి. అందుకు తగిన ప్రణాళికలను రచించాలి. ఇప్పట్లో కరోనా కష్టాలు తొలగవు కనుక వలస కూలీలు స్వగ్రామాలకు చేరాక కనుక వారి వివరాలు సేకరించాలి. వారు ఏయే రంగాల్లో నిష్ణాతులో గుర్తించాలి. పనుల ఆధారంగా వారికి కనీస వేతనాలు నిర్ణయించి ప్రభుత్వ మే అనుసంధానకర్తగా పనులు అప్పగించేలా ఆయా సంస్థలతో ఒప్పందాలు చేసుకోవాలి. కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేసి వారికి అండగా నిలిచేలా రాష్ట్రాలను కేంద్రం ఆదేశించాలి. అప్పుడే వారికి ఆదరణ దక్కుతుంది. ప్రభుత్వాలపై భరోసా ఏర్పడుతుంది. అలాగే నష్టపోయిన, పోతున్న రంగాల ప్రజలను గుర్తించి వారికి ఆర్థికంగా అండగా నిలిచేలా చేయూతకు సిద్ధపడాలి.

పేదలకు గూడు కల్పించేందుకే డబుల్ ఇళ్లు

డబుల్ ఇళ్ల సముదాయాన్ని ప్రారంభించిన మంత్రి

సూర్యాపేట,మే28(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పేదలు గూడు లేకుండా ఉండకూడదన్నసీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగాణ పని చేస్తున్నామని విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. పేదలు గౌరవంగా బతకాలనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సిఎం ప్లాన్ చేశారని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి వద్ద రూ. 5 కోట్ల 8 లక్షల అంచనా వ్యయం తో నిర్మించిన 80 డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి ఇస్తామన్నముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం మేరకే ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి అంశాన్ని విధిగా అమలు పరిచేందుకు అడుగులు పడుతున్నాయని ఆయన తెలిపారు. ఇళ్ల నిర్మాణం ఎక్కడా ఆగలేదని అన్నారు. గుంపుల తిరుమలగిరిలో ఏకకాలంలో 80 మంది లబ్దిదారులు గృహప్రవేశం జరుపుకోవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. డబుల్ ఇండ్ల నిర్మాణం నాణ్యతలో ఎటువంటి రాజీ లేదని, అదే సమయంలో లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని జగదీష్‌రెడ్డి స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం జరిగిన కాలనీలు రోల్ మోడల్ గా ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు. లబ్దిదారులు విధిగా మొక్కలు పెంచేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట నియోజకవర్గం చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరి వద్ద రూ. 5 కోట్ల 8 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 80 డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

కష్టంగా వేసవిలో పశువుల సంరక్షణ

రక్షణ చర్యలు తీసుకునేలా సూచనలు

హైదరాబాద్,మార్చి28(ఆర్ఎన్ఎ): పశు పోషకులు గొర్రెల, మేకల పెంపకందారులు వేసవిలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అవి అనారోగ్యానికి గురికాకుండా, వడదెబ్బ బారిన పడకుండా సంరక్షించుకోవచ్చనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, వాల్‌పోస్టర్లను పంపిణీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. పశువుల నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉండే విధంగా చూడాలని సూచించారు. వేసవిలో ఎండ తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల వల్ల పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తీవ్ర అనారోగ్యానికి లోను కావటంతో పాటు వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంటుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏటా ముందస్తుగానే స్పందించి పశు సంవర్ధకశాఖ అధికారులను పశు వైద్యసిబ్బందిని అప్రమత్తం చేస్తోంది. పశు సంవర్ధకశాఖ కార్యదర్శి ఆదేశం మేరకు జిల్లాల్లో పశు సంవర్ధకశాఖ అధికారులు పశువుల సంరోణ చర్యలు చేపట్టారు. పశువులు, గొర్రెలు, మేకలను ఉదయం సాయంత్రం వేళ మాత్రమే మేపాలని సూచించారు. ఇందులో భాగంగానే పశు సంవర్ధకశాఖ కార్యదర్శి నుంచి అధికారులకు సూచనలు జారీచేశారు. మూగజీవాల సంరక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునే విషయాలపై పశువుల, గొర్రెల, మేకల పెంపకందారులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని సూచించారు. పశు గ్రాసం, తాగునీటి కొరత తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవల్సిందిగా ఆదేశించారు. మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా వాటిని శాస్త్రీయ యాజమాన్య పద్ధతిలో పెంచటం వల్ల వాటి ఉత్పాదక శక్తి తగ్గకుండా రైతులు ఆశించిన ఫలితాలను పొందే అవకాశముంటుందని పేర్కొన్నారు. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి, బలహీనంగా మారుతాయి. పశువులు సరిగా నడవలేక తూలుతూ పడుకోవటానికి ప్రయత్నిస్తాయి. జీవక్రియ తగ్గిపోవటం, ఆకలి మందలించటం, ఆహారం తక్కువగా తీసుకోవటం వల్ల వ్యాధి నిరోధక శక్తి తగ్గి ఇతర వ్యాధులు, పరాన్నజీవులు ఆశించే అవకాశం ఎక్కువవుతుంది. కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి గుంటల్లో ఉన్న నీటిని తాగడంతో జీర్ణకోశ వ్యాధులు ప్రబలుతాయి. వడదెబ్బకు గురైన వాటిలో దాహం పెరుగుతుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ లాంటి పదార్థాలు ఇవ్వటం మంచిదని అన్నారు. పాలను ఇచ్చే పశువులకు పశు దాణా నీటితో కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిది. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి శరీర ఉష్ణోగ్రత తగ్గించటానికి పలువార్లు నీటితో కడగడం, తల నుదుటి మీద మంచుముక్కలు ఉంచడం లేదా చల్లని గోనె సంచిని కప్పడం గానీ చేయాలన్నారు.

విషాదం మిగిల్చిన బోరు బావి

బాలుడు సాయివర్ధన్ మృతి

అధికారులు శ్రమించినా దక్కని ఫలితం

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

మెదక్,మే28(నేటినిజం ప్రతినిధి): మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పోచ్చన్‌పల్లిలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం బోరు బావిలోపడిన బాలుడు సంజయ్‌సాయి వర్ధన్ మృతి చెందాడు. 25 అడుగుల లోతులో బాలుడి మృతదేహం లభ్యమైంది. బోరుబావిలో మట్టిపెళ్లలు కింద బాలుడి మృతదేహం పడివుండటంతో బాలుడు ప్రాణాలు విడిచాడు. అయితే.. సమాంతరంగా గొయ్యిని తవ్విన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు.. ఎంతగా ప్రయత్నించినా ఆక్సిజన్ అందకపోవడంతో బాలుడు సంజయ్‌సాయి వర్ధన్ మరణించాడు. బాలుడి ప్రాణాలను రక్షించడానికి 12 గంటలపాటు ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ సిబ్బంది శ్రమించినా ఫలితం లేకపోయింది. ఈ విషాద ఘటనతో బాలుడి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పొచ్చన్‌పల్లి విషాదఘటనపై టీఆర్ఎస్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కంటతడి పెట్టారు. నీళ్లు పడని బోరుబావులను రైతులు, స్థానిక అధికారులు పూడ్చివేయాలని వేడుకున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు

పోతిరెడ్డిపాడు విషయంలో దాగుడుమూతలు

సీమవాసుల కోసం కెసిఆర్ తాపత్రయం: జీవన్ రెడ్డి

కరీంనగర్,మే28(ఆర్ఎన్ఎ): పోతిరెడ్డిపాడుతో రాయలసీమ వాసుల ప్రేమ పొందాలని కేసీఆర్ చూస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. అందుకే జివో 203పై మౌనంగా ఉంటూ జగన్ నిర్ణయాలకు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓట్ల కోసం జగన్‌తో కేసీఆర్ కుమ్మక్కయ్యారని విమర్శించారు. తెలంగాణను ఎండబెట్టి.. రాయలసీమకు నీళ్లిస్తున్నారన్నారు. ఎఫ్‌సీఐ ప్రకటనతో కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగలేదన్నారు. నియంత్రిత సాగు విధానం కాదు.. నిర్బంధ సాగు విధానంతో రైతాంగాన్ని కేసీఆర్ అప్పులపాలు చేయబోతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంతో ఎన్ని ఎకరాలు పారాయన్నదానికి లెక్క లేదన్నారు. కాళేశ్వరంను చూపి ప్రజలను మబ్బ పెట్టే ప్రయత్నం జోరుగా సాగిస్తున్నారని మండిపడ్డారు.

దేశంలో 6,566 కొత్త కరోనా పాజిటివ్ కేసులు

న్యూఢిల్లీ,మే28(ఆర్ఎన్ఎ): భారత్ లో రోజురోజుకూ కరోనా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. గడిచిన 24 గంటల్లో 6,566 కొత్త కోవిడ్-19 పాజిటివ్ కేసులు, 194 మరణాలు నమోదయ్యాయని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 1,58,333కి పెరిగింది. వీటిలో ప్రస్తుతం 86,110 యాక్టివ్ కేసులున్నాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 67,692 నయమై కోలుకున్నారు. ఈ వైరస్ మహమ్మారితో 4,531 ప్రాణాలు కోల్పోయారు. ఇండియాలో కోలుకున్న వారు 42.72 శాతంగా ఉందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. అటు ప్రపంచవ్యాప్తంగా కరోనా వ్యాప్తి ఆగడం లేదు. ప్రపంచలో 56లక్షల 81వేల మందికి కరోనా వైరస్ సోకింది.

రాజస్థాన్‌లో కొత్తగా 131 కరోనా పాజిటివ్ కేసులు

ప్రజలు సాధారణ జీవనంవైపు క్రమంగా అడుగులు వేస్తున్నవేళ కరోనా వైరస్ ఆందోళనకు గురిచేస్తున్నది. ఎడారి రాష్ట్రమైన రాజస్థాన్‌లో గత 24 గంటల్లో కొత్తగా 131 కరోనా పాజిటివ్ కేసులు నమోదవగా, ఆరుగురు మరణించారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 7947కు చేరగా, మృతులు 179కి పెరిగారు. ఇప్పటివరకు నమోదైన కరోనా పాజిటివ్ కేసుల్లో 3202 యాక్టివ్‌గా ఉండగా, 4566 మంది బాధితులు కోలుకున్నారు. కొత్తగా నమోదైన 131 కేసుల్లో అత్యధికంగా ఝులావర్‌లో 69, పాలిలో 13, భరత్‌పూర్‌లో 13 చొప్పున ఉన్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది.

రుతుస్రావంపై ఎడ్యుకేట్ కావాలి: స్మృతి

న్యూఢిల్లీ,మే28(ఆర్ఎన్ఎ): రుతుస్రావం అనేది సిగ్గుపడాల్సిన అంశం కాదని,అది శరీరంలో జరిగే సహజ పక్రియ అని కేంద్ర మహిళా-శిశు అభివృద్ధిశాఖ మంత్రి స్మృతి ఇరానీఅన్నారు. ఈ విషయంలో అమ్మాయిలనే కాదు అబ్బాయిలను ఎడ్యుకేట్ చేయాల్సిందిగా స్మృతి ఇరానీ పిలుపునిచ్చారు. మెనుస్ట్రియల్ హైజిన్ డే సందర్భాన్ని పురస్కరించుకుని మంత్రి ట్విట్టర్ ద్వారా స్పందించారు. జన్ ఔషధి కేంద్రాల్లో అందుబాటు ధరలకే శానిటరీ నాప్‌కిన్స్‌ను లభిస్తున్నయన్నారు. దేశంలోని మహిళలంతా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావంపై అవగాహన కల్పించే నిమిత్తం ప్రతీ ఏడాది మే 28న మెనుస్ట్రియల్ హైజిన్ డే ను నిర్వహిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న ప్రజలను పట్టించుకోని ప్రభుత్వాలు

వలస కార్మికులను ఆదుకోవడంలో విఫలం

గాంధీభవన్‌లో కార్మికులతో మాట్లాడిన ఉత్తమ్

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): కరోనా వల్ల ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. వలస కార్మికులకు, నిరుపేదలకు ఆహారం, ఆశ్రయం, భద్రత, సరైన రవాణా సదుపాయం కల్పించలేకపోయాయని ఎద్దేవా చేశారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో వలస కార్మికులతో ముచ్చటించారు. లాక్ డౌన్ వల్ల ఏర్పడిన సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహాయం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వలస కార్మికులకు తక్షణమే రూ.10 వేలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ

రాష్ట్రాన్ని ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం కరోనా పరీక్షలు సరిగా చేయడం లేదని, దేశంలో అత్యంత తక్కువ టెస్టులు తెలంగాణలోనే జరిగాయని పేర్కొన్నారు. మంత్రి ఈటల రాజేందర్ రోజుకు 5 వేల టెస్టులు చేస్తామని చెప్పారని, మరిప్పుడెందుకు చేయడం లేదని ప్రశ్నించారు. టెస్టులు చేయాలని హైకోర్టు ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా ప్రభుత్వానికి సోయి రావడం లేదని విమర్శించారు. ఇటు ధాన్యం కొనుగోలులో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. కోటి లక్షల మెట్రిక్ టన్నులు కొంటామని చెప్పి, ఇప్పుడు 50 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నారని తెలిపారు. పైగా కొన్ని రకాల విత్తనాలు అమ్మాలని, మరికొన్ని విత్తనాలు అమ్మవద్దని ఆదేశాలిచ్చారని.. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అటు ఉపాధిహామీ పథకంలో సరిగా పని కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఒరిస్సా కార్మికుల కోసం కాంగ్రెస్ పార్టీ బస్సు ఏర్పాటు చేసింది. ఇదిలా వుంటే నాలుగు అంశాలపై 'స్పీక్ అప్ ఇండియా' పేరుతో కాంగ్రెస్ సోషల్ మీడియా పోరాటం చేస్తోంది. ఏఐసీసీ పిలుపు మేరకు ఈ ఆన్‌లైన్ పోరాటంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొంటున్నారు. లాక్ డౌన్ పై స్పీక్ అప్ ఇండియా పేరుతో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న పోరాటంలో ఆయన పాల్గొన్నారు. గాంధీభవన్‌లో వలస కార్మికులతో సమావేశమై వారి కష్టాలు తెలుసుకున్నారు ఉత్తమ్. వలస కార్మికులకు, పేదలకు భద్రత, ఆహారం, ఆశ్రయం కల్పించలేకపోయాయని విమర్శించారు.

తెలుగుదేశం పార్టీని కదిలించలేరు

ఎన్టీఆర్ ఓ రాజకయీ శక్తి

రెండోరోజు మహానాడులో చంద్రబాబు

అమరావతి,మే28(ఆర్ఎన్ఎ): తెలుగుదేశం పార్టీని ఎవరూ కదిలించలేరని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గురువారం నాడు తెలుగుదేశం పార్టీ 'మహానాడు' రెండో రోజు ప్రారంభమైంది. దివంగత నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి కావడంతో బాబుతో పాటు పలువురు ముఖ్యనేతలు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. అనంతరం మహానాడులో భాగంగా చంద్రబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ వ్యక్తి కాదు వ్యవస్థ అని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జీవితం ఆదర్శనీయమని.. సేవకు నిలువెత్తు రూపమన్నారు. 'మనపై బురదజల్లిన వారే బురదలో కూరుకుపోయారు. రాజకీయాల్లో ఎన్టీఆర్‌కు సాటిలేరు. పార్టీ స్థాపించిన 9 నెలల్లో అధికారంలోకి వచ్చారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించారు. సామాజిక న్యాయం చేసిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగుదనానికి నిలువెత్తు రూపం ఎన్టీఆర్. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి. పేదలకు ఫ్టటెడన్నం పెట్టడమే తన సిద్దాంతమని ఎన్టీఆర్ చెప్పేవారు' అని చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశం ఎవరికీ భయపడదు. సవాళ్లు తెలుగుదేశానికి కొత్త కాదు. తెలుగుదేశాన్ని ఎవరూ కదిలించలేరు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా కార్యకర్తలు పార్టీకి అండగా నిలబడుతున్నారు. కార్యకర్తలే తెలుగుదేశం శక్తి. వైసీపీ బెదిరింపులకు ఎవరూ భయపడరు. హత్యా రాజకీయాలు మాకు అలవాటు లేదు. డాక్టర్ సుధాకర్ విషయంలో వైసీపీ తీరు దుర్మార్గం. తెలుగుదేశం అధికారంలోకి రావడం ఖాయం' అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

జగన్‌కు జైలుబుద్ధి ఇంకా పోలేదు: అయ్యన్న

అమరావతి,మే28(ఆర్ఎన్ఎ): అసమర్థుడు, దొంగ, జైల్లో ఉండి 16 నెలలు చిప్పకూడు తిన్నటువంటి సీఎం జగన్ పరిపాలన ఏ విధంగా ఉంటుందో అందరికీ తెలిసిందేనని టీడీపీ నేత, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు అన్నారు. మహానాడు సందర్భంగా రెండో రోజు గురువారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రికింకా జైలు బుద్ధులు పోలేదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఏడాది పాలనలో అరాచకం, హింసా, విధ్వంసాలు చెలరేగిపోయాయని ఆరోపించారు. వేధింపులు, బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలు హద్దు అదుపులేకుండా పోయాయన్నారు. ప్రాణాలకు రక్షణ కరువై ప్రజలు భయంతో బిక్కు బిక్కు మంటూ బతుకుతున్నారని అయ్యన్న అన్నారు. పారిశ్రామిక వేత్తలను బెదిరించి ఏపీ నుంచి తరిమేశారని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఇవన్నీ ఏడాది పాలనలో చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, దోపిడీలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ భూములు అమ్మకానికి పెడుతున్నారని, ప్రైవేటు భూములు కూడా బలవంతంగా లాక్కుంటున్నారని ఆరోపించారు. ఇంకా దారుణం ఏంటంటే.. తిరుమల తిరుపతి శ్రీవారి భూములు కూడా అమ్ముకునే పరిస్థితికి ఈ ప్రభుత్వం వచ్చిందని అయ్యన్న పాత్రుడు మండిపడ్డారు.

నిర్దిష్ట వ్యవసాయ విధానం అవసరం

హైదరాబాద్, మే 28:స్వాతంత్ర్యం లభించి 70సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జటిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్నప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శరాఘాతంగా మారింది. కాలం అయినా ,కరువు అయినా రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. బహుళ జాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు వ్యవసాయాన్ని అనుత్పాదక రంగంగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్దంగా ఉంటున్నారు. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటవండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. మనరైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. వ్యవసాయభూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. అంతెందుకు రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ కూడా తన వాగ్దానాన్ని నెరవేర్చుకోలేదు. కల్తీలు కూడా రైతును కాటేస్తు న్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలి పోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. ఇన్నేల్లుగా ఇంకా రైతుల సమస్యలను నిత్యం చర్చించే స్థాయి కొనసాగుతోంది. నిపుణులు, శాస్త్రవేత్తలు, అనుభవం కలిగిన రైతుల సలహాలు తీసుకుని వ్యవసాయ విధానాలు రూపొందించడం లేదు. రైతులకు ఖాతాల్లో డబ్బులు వేయడం,రుణాలు మాఫీ చేయడం, పెట్టబడి కింద కొంత జమచేయడం వల్ల సమస్యలు తీరవని అనుభంలో తెలుస్తున్నా పరిష్కారం ఆలోచించడం లేదు. గతంతో పోలిస్తే ఈ యేడు ప్రస్తుత సీజన్‌లో వరి ఉత్పత్తి పెరిగింది. ఇకపోతే తెలంగాణలో వానాకాలంలో నియంత్రిత పంటలకు ప్రణాళిక సిద్దం అయ్యింది. ఈ దశలో ఊరూవాడ దీనిపై జోరుగా చర్చ సాగుతోంది. పంటలకు సంబంధించి వ్యవసాయాధికారులు రైతులకు వివరిస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు నిత్యం చైతన్య కార్యక్రమాలు

చేపడుతున్నారు. మార్కెట్లకు విపరీతంగా ధాన్యం వచ్చి చేరుతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి ధాన్యం సేకరణ ముమ్మరంగా సాగుతోంది. మరోవైపు ధాన్యం కొనడం లేదని ఆయా ప్రాంతాల్లో రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. ఈ దశలో గిట్టుబాటు ధరలు చెల్లించి వచ్చిన ధాన్యం వచ్చినట్లుగా, మద్దతు ధరలు చెల్లించి కొనుగోలు చేస్తేనే రైతులకు ఊరట దక్కనుంది. తెలంగాణలో మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ అనుకూల విధానాల కారణంగా పంట దిగుబడులు పెరిగాయి. అలాగే ఎపిలోనూ ఈ సీజన్‌లో వరిదిగిబడి పెరిగిందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే మద్దతు ధరలతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దళారుల బెడద లేకుండా రైతులకు అండగా అధికారులు నిలవాలి. అలాగే ఇటీవలి వడగళ్లు, అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం కూడా కొంటేనే రైతులకు ఊరట. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమాను లకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగి పోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు. వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. దీంతో సమస్య తాత్కాలిక ఉపశమనం కలిగిస్తోంది తప్ప సమస్యను శాశ్వతంగా దూరం చేయడం లేదు.

నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు

ఉపాధి కూలీలతో మొక్కల పెంపకం

హరితహారం కోసం అటవీశాఖ కసరత్తు

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): హరితహారం ప్రతి ఒక్కరి కార్యక్రమమని, దీనిని సమిష్టిగా చేపట్టినప్పుడే ఫలితాలు రాబట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. లాక్‌డౌన్ కొనసాగుతున్నా అటవీశ్యాఖ మాత్రం నర్సరీల పరిరోణకు చర్యలు తీసుకుంటోంది. జూన్‌లో విర్షాలు కురిస్తే హరితహారం చేపట్టే అవకాశం ఉంది. ఈ దఫా ఉపాధి కూలీలను అడవుల పెంపకం కోసం ఉపయోగించుకునేలా కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. దీంతో మొక్కల పెంపకం జోరుగా సాగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది ఎక్కువ హరిత వనాల ఏర్పాటుకు ప్రాధాన్యతనిస్తున్నట్లు, వీలైనన్ని చోట్ల అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పండ్ల మొక్కల్లో అడవి మామిడి పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు, కూలీలను హరితమిత్ర అవార్డుకు నామినేట్ చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మరోవైపు హరితహారం లో ఈ సంవత్సరం లక్ష్యాన్ని చేరుకునే విధంగా మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిర్చయంతో ముందుకు సాగుతున్నారు. ఏటా చేపట్టిన విధంగానే వచ్చే వర్షాకాలంలో కూడా దీనిని పెద్ద ఎత్తున చేపట్ట బోతున్నారు. ప్రతి ఒక్కరూ దీనిని సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రభుత్వంతో కలసి రావాలని అన్నారు. ప్రతి జిల్లాను హరిత జిల్లాగా మార్చాలనీ, ఇందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేయాలని భావిస్తున్నారు. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టనున్నారు.

మూడు ఫీట్లకు పైగా ఉన్న మొక్కలను మాత్రమే నాటాలన్నారు. హరితహారం నిరంతర పక్రియ అని

చెప్పారు. ప్రతి ప్రభుత్వ సంస్థల్లో వంద శాతం పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్ కార్యాచరణ రూపొందించాలనీ, హరితవనాల కోసం స్థలాలను గుర్తించాలని పేర్కొన్నారు. ఏ రకం మొక్కలు ఏయే ప్రదేశాల్లో నాటాలో అటవీ శాఖ అధికారులు సూచనలివ్వాలని, సరైన సమయంలోనే మొక్కలు నాటడం చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు పండ్ల మొక్కలను సంబంధిత గ్రామప్రజలతో మాట్లాడి వారి సహాయ సహకారాలతో నాటాలన్నారు. నర్సరీల్లో మొక్కలు సరైన దశలో వృద్ధి చెందిన మీదటే నాటేందుకు చర్యలు చేపట్టనున్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టబోతున్నారు. పట్టణాల్లో జంక్షన్లు, రోడ్ల సుందరీకరణకు మొక్కలు నాటాలన్నారు. అవసరాలకు ఏయే రకం మొక్కలు ఎన్ని కావాలో సర్వే చేసి తదనుగుణంగా నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టామని తెలిపారు. వీటిని ప్రజలు కూడా ఉపయోగించుకోవాలని అన్నారు. మానవజాతి మనుడగకు చెట్లు సజీవసాక్ష్యం. వృక్షాలు అంతరించడం వల్లనే సరైన వర్షాలు కురువడం లేదని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. గతేడాది వరుణ దేవుడు కరుణించడంతో నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి.

ఇందులో భాగంగానే ఫారెస్ట్ నర్సరీలో లక్షల్లో వివిధ రకాల మొక్కల పెంపకం, అలాగే ఈజీఎస్ కింద వివిధ రకాల మొక్కలను పెంచిపోషిస్తున్నారు. వీటిని జులై మాసంలో గ్రామాల వారీగా పంపిణీ చేసి, అందరిచేత మొక్కలు నాటించేందుకు కృషి చేయనున్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయన్న ఆశాభావంతో నాలుగో విడత హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాలని సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం నర్సరీలో ఉన్న మొక్కలకు నీరుపట్టి బతికించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటూ, ఆయా నర్సరీ బాధ్యులకు ఎప్పటి కప్పుడు సూచనలు ఇస్తూ, వాటిని సందర్శిస్తూ, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలిస్తున్నారు. జూలైలో కార్యక్రమం ప్రారంభంకాగానే గ్రామాలకు వీటిన ఇతరలిస్తారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపడుతున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టారు. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ నర్సరీల్లో పండ్ల విభాగంలో జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, కర్జూరా, ఫ్లవరింగ్, సాధారణ మొక్కలు కానుగ, చింత, నీలగిరి, కుంకుడు, వెదురు, వంటి మొక్కలు పెంచుతున్నారు.

పీస్‌అండ్ వెల్ఫేర్ కమిటీలో వాలంటీర్లకు అవకాశం

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, మే 28 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పీస్‌అండ్‌వెల్ఫేర్(శాంతి,సంక్షేమ)కమిటీలో నూతనంగా వాలంటీర్లకు అవకాశం కల్పించనున్నామని కరీంనర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నెలకునిఉన్న విపత్కర పరిస్థితుల్లో పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రేయింబవళ్ళు శ్రమిస్తున్న తీరును గుర్తించి తమవంతు కర్తవ్యంగా స్వచ్ఛందంగా ముందుకువచ్చిన వాలంటీర్ల సేవలను వినియోగించుకున్నామని, ఇందులో చురుకైనపాత్రను పోషించిన వారికి పీస్‌అండ్‌వెల్ఫేర్ కమిటిలో అవకాశం కల్పించనున్నామని పేర్కొన్నారు.

గతమూడు సంవత్సరాలనుండి కమీషనరేట్‌లో పీస్‌అండ్‌వెల్ఫేర్ కమిటీని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న విషయం విదితమే.

పీస్‌అండ్‌వెల్ఫేర్ కమిటి సభ్యుల సహకారంతో పలుక్లిష్టమైన సమస్యలను పరిష్కరించడంలో పోలీస్‌శాఖ సఫలీకృతమయిందని తెలిపారు. ఈ కమిటీ ఏర్పాటుతో ఒకసుహృద్భావ వాతావరణం నెలకుని, కుల,మత,వర్గవిభేదాలు లేకుండా సమిష్టిగా పలుకార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఇటీవల ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో వివిధ కూరగాయల, మాంసహారమార్కెట్లు, నిత్యావసరవస్తువుల కొనుగోలు చేసే సూపర్‌మార్కెట్లు, కిరాణం దుకాణాల వద్ద ప్రజలను సామాజికదూరం పాటించేలా, సదరు మహమ్మారి వ్యాపిపై ప్రజలకు అవగాహన కల్పించేచర్యలను వాలంటీర్లు కొనసాగించారు.

పీస్‌కమిటీ నిర్వహించే సమావేశాలు, వివిధ రకాల కార్యక్రమాల్లో ఈమధ్యకాలంలో చురుకుగా పాల్గొనకపోవడమేకాకుండా, పోలీసులు తీసుకున్న వివిధరకాల చర్యల్లో వారి అవసరంఉన్నా హాజరుకాకపోవడం, వయోపరిమితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు ఈ కమిటీలో కొనసాగిన వారిని తొలగిస్తూ చురుకుగా సేవలందిస్తున్న వాలంటీర్లను ఈ పీస్‌అండ్ వెల్ఫేర్ కమిటీలో అవకాశం కల్పించనున్నామని వివరించారు.

నిర్ణీత సమయాల్లోనే వాలంటీర్ల సేవలు

వాలంటీర్ల సేవలను నిర్ణీత సమయాల్లోనే వినియోగించుకున్నామని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 06గంటలకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అల్పాహారం అందించి రద్దీఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఉదయం 10ల వరకు వినియోగించడంలో పోలీస్‌శాఖ సఫలీకృతమయిందని పేర్కొన్నారు. వాలంటీర్లగా సేవలందించేందుకు స్వచ్ఛందంగా ముందుకువచ్చిన వారికి పోలీస్‌శాఖ తరపున ఒకటీషర్ట్, గుర్తింపుకార్డు, విజిళ్ళు, శానిటైజర్లు, గ్లౌస్‌లు, ప్రశంసాపత్రాలను అందజేయడం జరిగిందని వివరించారు.

వాలంటీర్లు ఇదేస్ఫూర్తితో ముందుకుసాగాలి

వాలంటీర్లు ఇదేస్ఫూర్తితో ముందుకుసాగుతూ ప్రజాసేవలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కరీంనగర్ కమిషనరేట్ పోలీసులే ఈ విపత్కర పరిస్థితుల్లో మొదటగా వాలంటీర్ల సేవలను వినియోగించుకుని ఇతరప్రాంతాల వారికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. నూతనంగా నియామకంకాబడిన సభ్యులకు గుర్తింపుకార్డులను అందజేయనున్నామని తెలిపారు. ప్రజలకు సేవలందించే అవకాశం లభించడం అదృష్టంగా భావించాలని చెప్పారు. సమయసందర్భాలను గుర్తించి పోలీసులకు తమవంతుగా సేవలందించిన వాలంటీర్లకు పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

సరిహద్దు వివాదంలో తలదూరుస్తా

మీరు అంగకీరిస్తే సమస్య పరిస్కరిస్తా

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్య

న్యూఢిల్లీ,మే28(ఆర్ఎన్ఎ): భారత్, చైనా సరిహద్దుల్లో కొద్ది రోజులుగా ఘర్షణ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు

తెలంగాణ వైపు దూసుకొస్తున్న మిడతల దండు

సమాచారంతో రైతుల్లో ఆందోళన
వాటిని అరికట్టే వ్యవస్థ లేకపోవడంతో మరింత నష్టం
పంటలకు తీవ్ర నష్టం తప్పదంటున్న అధికారులు

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): ఓ వైపు కరోనా మహమ్మారి కారణంగా దేశం అతలా కుతలం అవుతుంటే మరో వైపు మిడతల దండు ఆందోళన కలిగిస్తోంది. పంట పొలాలపై దాడి చేస్తున్న మిడతలు ధాన్యాన్ని పంటను నాశనం చేస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. ఇక ఇప్పుడు మహారాష్ట్ర నుండి మిడతల దండు తెలంగాణకు చేరుకునే అవకాశం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ అప్రమత్తమైంది. మిడతలదండు ఉత్తర ఆఫ్రికా దేశాల నుంచి పాకిస్తాన్ మీదుగా రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలకు విస్తరించింది. వాటిలో సంతోత్పత్తి ఎక్కువగా ఉంటుందని ఒక్కో మిడత దాని బరువుకు సమానమైన ఆహారం తింటుందని వ్యావసాయాధికారుల అంటున్నారు . మరోవైపు మిడలదండుతో ఏర్పడనున్న ప్రమాదంపై వ్యవసాయశాఖ కార్యదర్శి బి. జనార్దన్‌రెడ్డి ఇప్పటికే ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించారు. మహారాష్ట్రలోని అమరావతి ప్రాంతంలో మిడతల దండును నియంత్రిస్తున్నట్లు అక్కడి అధికారులు తెలిపారు. ఒకవేళ అక్కడ ముడతలను కంట్రోల్ చేయకపోతే తెలంగాణకు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సరిహద్దు జిల్లాలైన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, భూపాలపల్లి, నిర్మల్‌లలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఇవి చెట్ల మీద ఆవాసం ఏర్పరుచుకొని పంటలకు భారీ నష్టం కలిగిస్తాయన్నారు. మిడతల దండును సామూహికంగా నివారించే విషయంపై రైతులను చైతన్యం చేయాలన్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాల మీదుగా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోకి ప్రవేశించిన మిడతల దండు జిల్లా వైపుకు వేగంగా దూసుకు వస్తోంది. దీంతో సరిహద్దుల్లో ఉన్న జిల్లాకు ముప్పు వాటిల్లే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే కరోనాతో అతలా కుతలమవుతున్నరైతులకు మిడతల బెడదతో కొత్త ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. జిల్లాకు సుమారుగా 200 కి.మీల దూరంలో ఉన్న మిడతలు జిల్లాలోకి ప్రవేశిస్తే కొంత ఇబ్బందికర పరిస్థితులే ఎదురయ్యే అవకాశం ఉంది. పదిరకాలుగా ఉండే మిడతల్లో ఎడారి మిడతలు అత్యంత ప్రమాదకరమైనవిగా వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అన్ని రకాల ఆకులను తినే మిడతలు పత్తి, మెక్కజొన్న, జొన్న లాంటి పంటలను బాగా ఇష్టపడతాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎలాంటి పంటలు లేక పోవడంతో పెద్దగా నష్టం ఉండదంటున్నారు. రైతులు వేసవి దుక్కులు చేయడం, పంట పొలాలను చదును చేసుకోవడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు. మహారాష్ట్ర సరిహద్దు మండలాలైన బోథ్, తాంసి, తలమడుగు, జైనథ్, బేల, భీంపూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లో మిడతల బెడదపై ఆందోళన కనిపిస్తోంది. మిడతలు జిల్లాలోకి ప్రవేశిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఎన్ని రోజుల పాటు వాటి ప్రభావం ఉంటుందో ఖచ్చితంగా తెలియక పోవడంతో అయోమయం ఏర్పడుతోంది. అసలే ప్రస్తుతం చిగురు కాలం కావడంతో పంట పొలాల సమీపంలోని అడవులు చిగురించి లేత ఆకులతో వచ్చగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో మిడతలు చెట్లపై ఆవాసం ఏర్పర్చుకొని పంటలపై దాడి చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎలాంటి పంటలు లేక పోయిన వాటి బెడదతో పంటలపై కొంత ప్రభావం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఒకవేళ జిల్లాలోకి ప్రవేశించిన రైతులు అప్రమత్తంగా ఉండి వివిధ రకాల శబ్దాలు, రసాయనాల పిచికారీతో తరిమి వేయాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించిన నటుడు బాలకృష్ణ తదితరులు

ఎపిలో వైకాపా సర్కార్ ఉండదు

త్వరలోనే బాబు నేతృత్వంలో ప్రభుత్వం
ఎన్టీఆర్‌కు నివాళి సందర్భంగా బాలకృష్ణ వ్యాఖ్యలు
నివాళి అర్పించిన భువనేశ్వరి తదితరులు

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): ఎపిలో ప్రస్తుతం ఉన్న వైకాపా ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవదని టిడిపి ఎమ్మెల్యే, నటుడుడ బాలకృష్ణ అన్నారు. ఇప్పుడు ఎపిలో ఏం జరుగుతుందో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజలు కూడా విసుగెత్తారని అన్నారు. దీంతో అక్కడ ప్రభుత్వం పూర్తికాలం మనలేదన్నారు. వైకాపా ప్రభుత్వం పడిపోవడం ఖాయమని సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో ఎపిలో టిడిపి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. ఎన్టీఆర్ ఘాట్‌లో నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఘనంగా నివాళు లర్పించారు. బాలకృష్ణ, సుహాసిని నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని ఆయను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఆయన పుట్టిన రోజుంటే తెలుగువారందరికి పండగని అన్నారు. 'తెలుగు అనే మూడు అక్షరాలు వింటే నా ఒళ్లు పులకరిస్తుందని ఆయన ఎన్నో సందర్భాల్లో చెప్పారని.. అలాగే ఎన్టీఆర్ అనే మూడు అక్షరాలు వింటే నా రక్తం పొంగుతుందని' అన్నారు. అందరూ అనుకున్నట్టు ఎన్టీఆర్ అంటే నందమూరి తారక రామారావు అని అనుకోనని, 'ఎన్' అంటే నటనాలయం, 'టీ' అంటే తారమందలంలోని తారక ధృవతారకుడు 'ఆర్' అంటే రాజర్షి రారాజు అని వర్ణించారు. తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని బాలకృష్ణ కొనియాడారు. మరోవైపు ఇటీవల కెసిఆర్‌ఓ సమావేశానికి తనను పిలవలేదని మండిపడ్డారు. ఇక్కడ కూర్చుని భూములు పంచుకుంటున్నారా అని మండిపడ్డారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన కుమార్తె, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించారు. ఆమె వెంట టీటీడీపీ నేతలు ఎల్.రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కొత్తకోట దయాకర్‌రెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా ఎల్.రమణ మాట్లాడుతూ..

దేవుళ్ళను ప్రజలు ఎన్టీఆర్‌లో చూసుకున్న గొప్ప వ్యక్తి ఎన్టీఆర్. నిర్లక్ష్యానికి గురైన వర్గాలకు నేనున్ననంటూ ఎన్టీఆర్ ఆదుకున్నారు. ఎన్టీఆర్ ఆశయసాధన కోసం చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తాం. భారతరత్న ఇచ్చినప్పుడే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి. ప్రజల పట్ల నేటి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. ఎన్టీఆర్, చంద్రబాబులు సేవకులుగా భావించి పనిచేశారని పేర్కొన్నారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సినీ, రాజకీయ రంగంలో ఎన్టీఆర్ రారాజుగా వెలిగారు. దేశానికి సంక్షేమాన్ని నేర్పించిన వ్యక్తి ఎన్టీఆర్. ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు ముందుకు తీసుకెళ్తున్నారు. ఎన్టీఆర్ పథకాలనే ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. నేషనల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి దేశ రాజకీయాలకు ఎన్టీఆర్ శాసించారు. ఆశయ సాధన కోసం కలసికట్టుగా ముందుకెళ్తాం అని పేర్కొన్నారు.

మోత్కుపల్లి నివాళి

ఎన్టీఆర్ ఘాట్‌లో బీజేపీ నేత మోత్కుపల్లి నర్సింహులు నివాళులర్పించారు. కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెడ్తానని జగన్ మాట తప్పాడన్నారు. డాక్టర్ సుధాకర్‌ను అవమానించటం దళితులను అవమానించిట్లేనని పేర్కొన్నారు. డాక్టర్ సుధాకర్‌పై ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. జగన్ గెలుపులో తన కృషి కూడా ఉందని మోత్కుపల్లి పేర్కొన్నారు. జగన్ గెలవాలని కాలి నడకన తిరుమల కొండ ఎక్కానన్నారు. కృష్ణా జిల్లాకు వెంటనే ఎన్టీఆర్ పేరు పెట్టాలన్నారు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా చేయాలని కేసీఆర్‌ను కోరుతున్నానన్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టకుంటే.. కేసీఆర్ ఎక్కడని ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వస్తే.. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తామని మోత్కుపల్లి తెలిపారు.

సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన మంత్రి శ్రీనివాస గౌడ్

అభివృద్ధిలో దేశంలోనే నంబర్‌వన్‌గా తెలంగాణ

-సన్నాలతో లాభాలు మెండు: మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్,మే28(ఆర్ఎన్ఎ): సీఎం సూచనల ప్రకారం నియంత్రిత సాగుబడి మేలని ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వీ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. ప్రభుత్వం సూచించిన పంటలను సాగుచేస్తే ప్రభుత్వం రైతువద్దకే వెళ్లి పంటను కొనుగోలు చేస్తుందన్నారు. నూతన సాగు విధానంపై రైతుబంధు కమిటీ సభ్యులు, పీఏసీసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. మన ప్రాంత పరిస్థితులను తెలుసుకుని ఏయే పంటలు వేయాలనేది వ్యవసాయశాఖ అధికారులు నిర్ణయిస్తారని, అందుకనుగుణంగానే సాగుచేయాలని కోరారు. రాష్ట్రం ఏర్పాటైన తరువాత అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించిన మేరకు నియంత్రిత సాగుబడి వేలని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఎత్తు పెంచి ఏడాదంతా నీళ్లుండేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఎత్తును పెంచి.., పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా ఏ డాది పాటు నీరందించేందుకు చర్యలు చేపడుతున్న ట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వానకాలం సాగు కు గాను విత్తనాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వరిలో సన్నరకాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, విత్తనాలు, ఎరువులను రైతులు నేటి నుంచి తీసుకోవచ్చన్నారు. రుణమాఫీ డబ్బులు ప్రతి లబ్దిదారుడికి అందేలా రైతుబంధు సమితులు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఐదువేల ఎకరాలకు క్లస్టర్‌ను ఏర్పాటు చేసి, రైతువేదిక భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నూతన వ్యవసాయ విధానానికి కట్టుబడి ఉంటామని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కరువు జిల్లాగా ఉన్న పాలమూరును సస్యశ్యామలంగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కోయిల్‌సాగర్ నుంచి రామన్‌పాడు వరకు ఊకచెట్టు వాగుపై 36 కిలోమీటర్ల మేర ఎప్పుడూ నీటితో కళకళలాడుతూ ఉంటుందన్నారు.

సురవరం గొప్ప వైతాళికుడు

నివాళి అర్పించిన మంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,మే28(ఆర్ఎన్ఎ): సురవరం ప్రతాప్ రెడ్డి 124 వ జయంతి సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో ఆయన విగ్రహానికి ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కవులే లేరన్న ఆంధ్రుల అపవాదును తిప్ప కొట్టేందుకు గోల్కొండ పత్రికను స్థాపించి ఎందరో కవులను వెలికి తీసిన గొప్ప వైతాళికుడు సురవరం ప్రతాప్ రెడ్డి అన్నారు. తెలంగాణలో పల్లెపల్లె తిరుగుతూ ఇక్కడి సాహిత్యాన్ని సేకరించి తెలంగాణ ఔనత్యాన్ని చాటి చెప్పిన మహోన్నతమైన వ్యక్తి అని సురవరం సేవలను మంత్రి కొనియాడారు. తెలంగాణ వైతాళికుల్లో ఆయనది విడదీయలేని స్థానమన్నారు.

అటవీ అధికారులను ముప్పు తిప్పుల పెట్టి ఎట్టకేలకు వలకుచిక్కిన చిరుత

చిరుత దాడిలో ఇద్దరు సిబ్బందికి తీవ్ర గాయాలు
మత్తుమందు ఇచ్చి హైదరాబాద్ జూకు తరలింపు

నల్లగొండ,మే28(ఆర్ఎన్ఎ): నల్లగొండ మర్రిగూడ మండలం రాజపేట తండా సమీపంలో ప్రజలను, రైతులకు తీవ్ర భయాందోళనకు గురి చేసిన చిరుతను ఫారెస్టు సిబ్బంది ఎట్టకేలకు పట్టుకున్నారు. గురువారం ఉదయం నుంచి రైతులను హడలెత్తించి.. ఇద్దరు ఫారెస్టు సిబ్బందిపై దాడి చేసిన చిరుతను చివరకు బంధించారు. రాజపేట తండా సమీపంలోని ఓ రైతు తన పొలానికి రక్షణగా ఏర్పాటు చేసిన కంచెలో చిరుత పులి చిక్కుకుంది. చిరుతను గమనించిన రైతులు.. అటవీశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఉచ్చులో ఉన్న చిరుతను బంధించేందుకు అటవీశాఖ అధికారులు మత్తు మందు ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో చిరుత ఒక్కసారిగా ఫారెస్టు సిబ్బంది పైకి దూకి అందరిని హడలెత్తించింది. వారిని ఉరకులు పరుగులు పెట్టించింది. దీంతో చిరతను పట్టుకునేయత్నంలో వారు నానా ఇబ్బంది పడ్డారు. దానిని తరుముతూ వెంటపడ్డారు. ఈ సందర్భంగా చిరుత దాడిలో ఇద్దరు ఫారెస్టు సిబ్బంది గాయపడ్డారు. సిబ్బందిపై దాడి చేసిన అనంతరం చిరుత అక్కడున్న ఫారెస్టు అధికారుల వాహనం కిందకు వెళ్లింది. అప్రమత్తమైన సిబ్బంది, పోలీసులు.. మరోవలను జీపుపై నుంచి చిరుత కవర్ అయ్యేలా వేశారు. అటవీశాఖ అంబులెన్స్‌లో ఉన్న ఫారెస్టు సిబ్బంది.. నెమ్మదిగా చిరుతపైకి మత్తు ఇంజెక్షన్ ఇచ్చారు. మొత్తానికి చిరుత స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత చిరుతను బోనులోకి లాగారు. బోనులో నిర్బంధించిన పులిని హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్‌కు తరలించారు. చిరుతను బంధించడంతో.. రాజాపేట తండా వాసులతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఫారెస్టు అధికారులు, పోలీసులకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

వేములవాడ, మే 28 (నేటినిజం ప్రతినిధి):తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావుగారి 98 జయంతిని పురస్కరించుకుని గురువారం వేములవాడ పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగాతెలుగు దేశం పార్టీ పార్లమెంట్ కమిటీ సభ్యులు ఉమేందర్ గౌడ్ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబం నుండి వచ్చి కోట్లాది మంది సామాన్యులకు అండగా నిలిచిన మేరునగధీరుడు నందమూరి తారక రామారావు అని అన్నారు .ఎన్టీఆర్ జయంతి 1సందర్భంగా ఆ మహనీయుని ఆశయ సాధనకు పునరంకితమవుతానని అన్నారు . ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రామస్వామి గౌడ్ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు నందిపేట రమణ యాదవ్ తెలుగు యువత పార్లమెంట్ కమిటీ సభ్యులు తౌటు సాయి కుమార్ సీనియర్ నాయకులు గంప ప్రసాద్, శంకర్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు

మానవత్వం చాటుకున్న సెస్ డైరెక్టర్ అల్లాడి

వేములవాడ, మే 28 (నేటినిజం ప్రతినిధి):రుద్రంగి మండలకేంద్రనికి చెందిన గుంజే శ్రీను అనారోగ్యంతో సంవత్సరం క్రితం చనిపోగా అతని భార్య పద్మ పసిరికలతో పదహారు రోజుల క్రితం చనిపోవడంతో ఇద్దరు కొడుకులు ఒక సంవత్సరం కూతురు అనధాలుగా మిగిలారనే కథనాన్ని తెలుసుకొని సెస్ డైరెక్టర్ అల్లాడి రమేష్ తన వంతుగా చిన్నారుల భవిష్యత్తు కోసం రూ 15000 ల అందజేసి తన మానవతను చాటుకున్నారు మాట్లాడుతూ,ఇంత చిన్న వయసులో తల్లిదండ్రులను కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు,ఎమ్మెల్యే రమేష్ బాబు మంత్రి కేటీఆర్ దృష్టికి చిన్నారుల విషయం తీసుకెళ్లి సహాయం అందేలా చూస్తామని అన్నారు,సిరిసిల్ల రంగినేని ట్రస్టులు చిన్నారులను చేర్పిస్తానని తెలిపారు,చిన్నారులకు ఎవరులేరు కాబట్టి ప్రతి ఒక్కరు పెద్ద మనసుతో వీరికి చేయుతనివ్వాలని కోరారు

ఈ కార్యక్రమంలో, గొళ్ళెం నర్సింగ్,మడిశెట్టి ఆనందం, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ కల్లెడ దేవా రాజ్ ప్యాక్స్ డైరెక్టర్ నర్సారెడ్డి,మంచే రాజేశం,పొగుల నర్సయ్య,దాసరి గంగరజం బండారి నారాయణ ఈప్ప మల్లేశం పాల్గొన్నారు.

నిబంధన వారిదే.. బాధ్యత వహించాల్సింది వారే

- నిరుపేద కుటుంబాలకు రూ.10 వేల వారి ఖాతాలో జమ చేయాలి
ఆన్లైన్ ప్రచారం ప్రారంభించిన ఆది

వేములవాడ, మే 28 (నేటినిజం ప్రతినిధి):ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తీసుకున్న లాక్ డౌన్ నిర్ణయం అమలులో భాగంగా ప్రధాని మోదీ అనాలోచిత నిర్ణయాలతో దేశ ప్రజల బతుకులు అగమయ్యాయని కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.

గురువారం తన నివాసంలో అసంఘటిత కార్మిక రంగానికి, చిన్న తరహా పరిశ్రమలను, మత్స్యకారులకు ఆదుకోవాలని కోరుతూ ఏ సీ సీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఆయన తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి ఆన్లైన్ ప్రచారాన్ని నేనోడి నియోజకవర్గంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్తి భద్రతతో, ప్రభుత్వ ఖర్చుతో వలస కార్మికులను కేంద్ర ప్రభుత్వమే వాహనాల్లో సొంత రాష్ట్రానికి చేర్చాలని డిమాండ్ చేశారు. లాక్ డౌన్ కారణంగా చితికిపోయిన నిరుపేద కుటుంబాలకు రూ. 10 వేల నేరుగా ఆయా కుటుంబాల ఖాతాలోకే బదిలీ చేయాలని కోరారు. చిరు వ్యాపారులకు గ్రాంట్స్?తో పాటు ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీపట్టణ జిల్లా అధికార ప్రతినిధి సంగ స్వామి యాదవ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ,పాత సత్యలక్ష్మి ,కూరగాయల కొమురయ్య, చిలుక రమేశ్ ,కనికరపు రాకేశ్ ,అరుణ్ తేజ చారి , వస్తాదులా కృష్ణా,షేక్ సాబీర్ ,కొలకని రాజు తదితరులు పాల్గొన్నారు.

కనీస ఉత్తీర్ణత మార్కులు తగ్గించాలి

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో పరీక్షల వాయిదాతో పదో తరగతి విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉందని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తెలిపింది. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తగ్గించేందుకు పదో తరగతి ఉత్తీర్ణత మార్కులు 35 నుంచి 30కి తగ్గించాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, నూతనకంటి బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు బుధవారం విద్యాశాఖ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

ఫ్యాన్స కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్,మే28(ఆర్ఎన్ఎ): బాలానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గాంధీ నగర్‌లోని యాస్ ఫ్యాన్స కంపెనీలో గురువారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చింది. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.